క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మంగళగిరి టౌన్: పట్టణ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ ఏఈ జి.సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని టిప్పర్ల బజార్, మన్నెం బజార్, మార్కండేయ కాలనీ, కుబేర రైస్‌మిల్, రాయల్ కన్వెన్షన్ ఏరియా, ఎల్‌బీ నగర్, మైలా నగర్, ద్వారకా నగర్, ఆంజనేయ కాలనీ, బైపాస్‌రోడ్ ప్రాంతాల్లో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

తాత్కాలికంగా రైల్వేగేటు మూసివేత

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బోసు బొమ్మ సెంటర్, వైఎస్సార్ సెంటర్ మధ్య ఉన్న రైల్వేగేటును తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు తెనాలి ఎస్‌సీ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లి-మంగళగిరిని విజయవాడ-కేసీసీ స్టేషన్ల మధ్య అనుసంధానించే ఎస్‌సీ గేటు నెం.310 కి.మీ. 424/12-14 మధ్య అత్యవసర రోడ్డు మరమ్మతు పనులు చేపట్టనున్నామని, ఈ కారణంగా ఎస్‌సీ గేటను ఈ నెల 2వ తేదీ సాయంత్రం 7 గంటల నుంచి 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు (7 రోజులు) మూసివేయనున్నామని తెలిపారు. కావున ఈ రహదారిలో ప్రయాణించేవారు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని, దీనిపై తాడేపల్లి మండల రెవెన్యూ అధికారికి సమాచారం పంపినట్లు వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

తెనాలి రోడ్డు విస్తరణ ప్రతిపాదన ఆపాలని వినతి



మంగళగిరి టౌన్: నగర పరిధిలోని తెనాలి రోడ్డు విస్తరణ ప్రతిపాదనను నిలిపివేయాలని తెనాలి రోడ్డు వాసులు, హ్యాండ్‌లూమ్ వ్యాపారులు, చిరు వ్యాపారులు సోమవారం ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమ సంక్షోభం వల్ల దశాబ్ద కాలంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇప్పుడిప్పుడే వ్యాపారాలు మెరుగుపడుతున్నాయని, రోడ్డు విస్తరణ చేస్తే షాపులు కోల్పోయి వ్యాపారస్తులు రోడ్డున పడే అవకాశముందన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న 90 శాతం కంటే ఎక్కువ మంది రోడ్డు విస్తరణకు ఇవ్వలేమని లిఖిత పూర్వకంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. అహ్మదాబాద్, జైపూర్, మైసూర్, హైదరాబాద్‌ల మాదిరిగా తెనాలి రోడ్డును వాకింగ్ స్ట్రీట్‌గా అభివృద్ధి చేస్తే చేనేతలకు చేయూతనిచ్చినట్లేనని తెలిపారు.

పవన్‌కుమార్ కుటుంబానికి ఆర్థిక సాయం

దుగ్గిరాల: పార్టీ క్రియాశీల కార్యకర్త శృంగారపాటి పవన్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందటం బాధాకరం అని వారి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పేరుకలపూడి సర్పంచ్ గంగాధర్‌రావు అన్నారు. సోమవారం పవన్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించగా, వార్డుమెంబరు కళ్యాణ్‌కుమార్ రూ.5 వేలు అందించారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

మంగళగిరి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



ఇప్పటంలో మాట్లాడుతున్న డీవీఆర్



10వ వార్డులో క్యూఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరిస్తున్న డీవీఆర్

తాడేపల్లి రూరల్: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నట్లు మంగళగిరి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీవీఆర్ మాట్లాడుతూ త్వరలోనే మంచి రోజులు రానున్నాయని, కార్యకర్తలు ధైర్యంగా ముందుకు సాగాలని కోరారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మనందరం సమష్టిగా కృషి చేసి జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఏడాది కాలంలోనే అన్ని విధాలా వైఫల్యం చెందిందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఏ వ్యక్తి, వర్గం సంతృప్తిగా లేరని, మహిళలు, నిరుద్యోగులు, రైతులు ఇలా అన్ని రంగాలకు చెందిన వ్యక్తులు దగా పడ్డారని విమర్శించారు. అనంతరం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను స్థానిక నాయకులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.కృష్ణమూర్తి, బాజీ గంగాధరరావు, మోదుగుల బ్రహ్మారెడ్డి, కళ్ళం పిచ్చిరెడ్డి, జిల్లా మానవ హక్కుల కమిటీ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి, నాయకులు దొంతిరెడ్డి చంద్రశేఖరరెడ్డి, గ్రామ అధ్యక్షుడు పోరంకి ప్రవీణ్, వెంకటేశ్వర్లు, పిన్నెపల్లి పద్మసుధ, ఎస్‌కే ఆరిఫా, మున్నంగి మనోహరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని కోల్పోయింది

మంగళగిరి టౌన్: జగనన్న పాలనలోనే అన్ని సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాయని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. మంగళగిరి పరిధిలోని 10, 11, 22 వార్డుల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డీవీఆర్ మాట్లాడుతూ ప్రజల్ని నమ్మించి వంచించడం చంద్రబాబు నైజమని, కూటమి ప్రభుత్వంలో ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి రుణాంధ్రప్రదేశ్‌గా మార్చారని, కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని వ్యాఖ్యానించారు. వార్డు స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు చేస్తున్న మోసాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. అనంతరం క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయా వార్డుల్లో జరిగిన కార్యక్రమాల్లో పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, సీనియర్ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, కుబేర స్వామి, ఫిరోజ్, జిల్లా నాయకురాలు మల్లవరపు సుధారాణి, పట్టణ మహిళా అధ్యక్షురాలు సంకె సునీత, 22వ వార్డు ఇన్‌చార్జి షేక్ బాబు, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్, మున్నుస్వామి, సునీత, సురేష్, నాగుల్ మీరా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాతంగి బాబు, నాయకులు సయ్యద్ గౌస్, మాదల గోపి, సురేష్, సుబ్బారావు, భాస్కరరావు, గంజి ఆనంద్, ప్రభాకర్, ఓంకార్, ప్రవీణ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాడవాడలా వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించండి

మంగళగిరి, తాడికొండ ఇన్‌చార్జిలు దొంతిరెడ్డి వేమారెడ్డి, వనమా బాల వజ్రబాబు

తాడికొండ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని నేడు తాడికొండ నియోజకవర్గంలో ప్రతి గ్రామం, వాడవాడలా ఘనంగా నిర్వహించాలని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్) తెలిపారు. తుళ్ళూరు మండలంలో నిర్వహించే కార్యక్రమంలో మాజీ ఎంపీ, మూడు జిల్లాల పార్టీ కో ఆర్డినేటర్ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి హాజరుకానున్నారని, సేవా కార్యక్రమాలు చేయాలని ఆయన సూచించారు.

ఫిరంగిపురం: పేదల పెన్నిధి దివంగత నాయకుడు డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు సొలస బస్టాండు సెంటర్లోని రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు హాజరవుతారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని, రెడ్డి యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మంగళగిరి టౌన్: దివంగత ముఖ్యమంత్రి, మహానేత రాజశేఖరరెడ్డి వర్ధంతిని నేడు ఘనంగా నిర్వహించనున్నట్లు నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. నగర పరిధిలోని మంగళవారం ఉదయం 10 గంటలకు బస్టాండ్ వద్ద ఉన్న రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పించి అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే తాడేపల్లి వైఎస్సార్ సెంటర్‌లో వున్న డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద మంగళవారం ఉదయం 9 గంటలకు వర్ధంతి కార్యక్రమాన్ని కళ్ళం రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి విచ్చేయనున్నారని, పట్టణ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, వైఎస్సార్ అభిమానులు పాల్గొనాలని కోరారు.

దుగ్గిరాల: మహానేత వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలను ప్రతి గ్రామంలోని నిర్వహించాలని మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తాడిబోయిన శివగోపయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనండి

ఆత్మకూరు(మంగళగిరి): దివంగత ముఖ్యమంత్రి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళగిరి పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి మంగళవారం ఉదయం 9 గంటలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి తెలిపారు. ఆత్మకూరులోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వర్ధంతి కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి వైఎస్సార్‌కు నివాళులర్పించాలని ఆయన కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపడతామని తెలిపారు. అదే విధంగా నియోజకవర్గంలోని వాడవాడలా ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు స్థానికులు ఘనంగా నివాళులర్పించాలని కోరారు.

నగరంలో ఈ-టాయిలెట్స్ ఏర్పాటు



ఈ-టాయిలెట్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ అలీమ్ బాషా తదితరులు

మంగళగిరి టౌన్: నగర పరిధిలోని గౌతమబుద్ధ రోడ్, కాళీమాత ఆలయం వద్ద ప్రజల సౌకర్యార్థం ఈ-టాయిలెట్స్‌ను ఏర్పాటు చేసినట్లు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా అన్నారు. సెల్‌కాన్, సీఎస్ఆర్ నిధులతో ప్రముఖ బ్రాండెడ్ కంపెనీ లూకేస్ ఏర్పాటు చేసిన ఈ-టాయిలెట్స్‌ను సోమవారం టీడీపీ నేతలతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ చొరవతో రాష్ట్రంలోనే మొట్టమొదటి ఈ-టాయిలెట్స్‌ను మంగళగిరిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పురుషులు, మహిళలతో పాటు దివ్యాంగులు సైతం వినియోగించుకునే విధంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. త్వరలోనే ఆర్‌టీసీ బస్టాండ్, పెట్రోల్ బంక్, నులకపేట అన్న క్యాంటీన్ వద్ద కూడా వీటిని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ-టాయిలెట్ ఎదుట కాఫీ షాప్, క్లాత్, జ్యూట్ బ్యాగ్స్, మొక్కజొన్నతో తయారు చేసిన డిస్పోజబుల్ గ్లాసెస్, క్యారీ బ్యాగ్‌లను విక్రయించే స్టాల్‌ను పర్మినెంట్‌గా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, తమ్మిశెట్టి జానకీ దేవి, ఆరుద్ర భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రైతాంగ కోరికల దినోత్సవం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాక ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏపీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం రైతాంగ కోరికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏపీకేఎస్ జెండాను రైతు సంఘం నాయకులతో కలసి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ఆవిష్కరించి, మాట్లాడుతూ ఈ నెల 8న అన్ని మండల కేంద్రాల్లో రైతు సంఘాలు, సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నియోజకవర్గ రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు గుంటక సాంబిరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు సుహాస్, కార్యదర్శి వెంకటేశ్వరరావు, తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల చోరీపై నిగ్గు తేల్చాలి



సర్వారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

తాడేపల్లి రూరల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఓట్ల చోరీపై నిగ్గుతేల్చాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి సీపీఐ కార్యాలయంలో కామ్రేడ్ బుర్రముక్కు సర్వారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని పార్టీ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సర్వారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ ఓటు చోరీ చేయడం అనేది రాజ్యాంగాన్ని ఖూనీ చేయడమేనని వ్యాఖ్యానించారు. మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్ మూడు వేల ఇళ్లపట్టాలు ఇచ్చారని, మిగతా వారిని కూడా గుర్తించి ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సీపీఐ మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి మునుసూరు సుహాస్, సీనియర్ నాయకులు మానికొండ డాంగే, మునగాల రామారావు, శీలం శ్యామ్, ప్రసాద్, కె.రాజు, ఎం.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు

వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు



డైమండ్ బాబుకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న సయ్యద్ హబీబుల్లా

తాడికొండ: పార్టీకోసం కష్టపడి పనిచేసే వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు తప్పక ఉంటుందని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు(డైమండ్‌బాబు) అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం అధికార ప్రతినిధిగా ఎంపికైన ఫిరంగిపురం మండలానికి చెందిన సయ్యద్ హబీబుల్లా పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నియోజకవర్గ ఇన్‌చార్జి బాల వజ్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మైనార్టీలకు పెద్దపీట వేస్తూ తాడికొండ నియోజకవర్గంలో పదవి కేటాయించడం వారి పట్ల జగనన్నకు ఉన్న అంకితభావానికి నిదర్శనమన్నారు. పదవులు అలంకారప్రాయం కాకుండా కష్టపడి పనిచేసి రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీ జెండాను ఎగరేయాలని సూచించారు. హబీబుల్లా మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగ అధికార ప్రతినిధి ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేసి విజయపథంలో నడిపిస్తానన్నారు. మండల యువజన, మైనార్టీ, బీసీ, ఎస్సీ అధ్యక్షులు సయ్యద్ సైదులు, షేక్ మస్తాన్ వలి, మాయకుంట్ల రాయప్ప, బోయనపల్లి సాల్మన్, ముఖ్య నాయకులు సలీమ్, దాసరి సురేష్, చేవూరి రామ్మోహన్ రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూలింగ్ పేరుతో రైతుల జీవితాలతో ఆటలు

తాడికొండ: రెండోదశ పూలింగ్ పేరుతో రైతుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతుందని ఏఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని నిడుముక్కలలో రెండోదశ పూలింగ్ ప్రకటనకు వ్యతిరేకంగా ఆయన చేస్తున్న నిరసన దీక్ష సోమవారం 64వ రోజుకు చేరింది. ఆయన మాట్లాడుతూ రెండవ దశ పూలింగ్ ప్రకటన చేసిన ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో రాజధాని రైతుల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. మొదటిదశ రైతులకు సౌకర్యాలు కల్పించి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, మహిళలు పాల్గొన్నారు.



మంగళగిరిలో లడ్డూను రూ.1,80,516కు దక్కించుకున్న భక్తులు



విఘ్నేశ్వరునికి పూజలు నిర్వహిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి తదితరులు

ప్రత్యేక పూజలు.. నిమజ్జనాలు



గణేష్ నిమజ్జనోత్సవంలో చిన్నారులు



దుగ్గిరాలలో నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న వినాయకుడు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మారుతీనగర్‌లో సోమవారం పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విఘ్నేశ్వర మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తాడేపల్లి 15వ వార్డులో బాలగణపతి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని మండపంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే సోమవారం పలుచోట్ల లడ్డూ వేలం పాటు, అన్నదాన కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి వినాయక విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై నిమజ్జనాలకు తరలించారు.



గణపతికి పూజలు చేస్తున్న బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి



వేమవరంలో గణపతి లడ్డును వేలంలో దక్కించుకున్న రత్నారెడ్డి



ఫిరంగిపురంలో నిమజ్జనానికి తరలిన గణేషుడు



ఫిరంగిపురం రామాలయం వద్ద నృత్యం చేస్తున్న అను డ్యాన్స్ అకాడమీ కళాకారులు